సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



ప్రత్యేక శ్రద్ధ

జంపపాలెం జెడ్పీ హైస్కూల్‌ను డీఈవో వెంకట లక్ష్మమ్మ తనిఖీ చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. 8లో



ఫార్మాకో విజిలెన్స్ వీక్

మహారాణిపేట (విశాఖ): ఫార్మాకో విజిలెన్స్ వీక్‌లో భాగంగా మందుల దుష్ప్రభావాలను ఏఎంసీలో వైద్య విద్యార్థులకు వివరించారు.

సిరులతల్లికి తులసి పూజ



డాబాగార్డెన్స్ (విశాఖ): కనకమహాలక్ష్మి అమ్మవారికి సహస్ర తులసిపూజ ఘనంగా నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు



మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: రాజకీయ ప్రయోజనాల కోసమే తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు నాయుడు దుర్మార్గమైన వ్యాఖ్యలు చేశారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంలోని లడ్డూ ప్రసాదంపై రాజకీయాలు చేయడం తగదని చెప్పారు. వేంకటేశ్వర స్వామి చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరారు. సూపర్ సిక్స్ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రముఖ పుణ్య క్షేత్రాన్ని రాజకీయాల్లోకి లాగడం తగదన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలకు భంగం కలిగించేలా ఉన్నాయని చెప్పారు. ప్రసాదం తయారీకి వినియోగించే ఆహార పదార్థాలను తనిఖీ చేసేందుకు టీటీడీ పరిధిలో ల్యాబ్ ఉన్న విషయం చంద్రబాబుకు తెలియకపోవడం దురదృష్టకరమని తెలిపారు. సీఎంస్థాయిలో ఉన్న వ్యక్తి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడటం బాధకరమన్నారు. ఆరోపణలు మానుకుని సమగ్ర విచారణ జరపాలని సూచించారు.

24 నుంచి 'పొలం పిలుస్తుంది'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నెల 24 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను స్పీకర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సాగు పద్ధతులు, కొత్త పద్ధతులు వివరించాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారులు సూచించే పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఆర్డీవో హెచ్.వి.జయరాం, ఏడీఏ శ్రీదేవి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పెద్దేరుకు మళ్లీ వరద పోటు



నిండుకుండలా పెద్దేరు జలాశయం

మాడుగుల: మండలంలోని పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు అధికంగా కురవడంతో ఇన్‌ఫ్లో పెరిగింది. జలాశయంలోకి 200 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జలాశయం ప్రధాన గేటు ద్వారా 120 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో మరింత పెరిగితే పెద్దేరు నదిలోకి వరద నీరు విడుదల చేస్తామని, రాత్రి పూట నదిలోకి రైతులు దిగరాదని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

'హైలెవెల్' దగా..!

- ఫార్మా సెజ్ ప్రమాదాలపై విచారణకు కమిటీ వేసిన ప్రభుత్వం
- 12 మంది బృందంతో హైలెవెల్ కమిటీ నియామకం
- సేఫ్టీ ప్రొటోకాల్స్‌పై అవగాహన లేని వారితో ఏర్పాటు
- కమిటీలో ఐఐటీ చెన్నై, ఐఐటీ తిరుపతి, నీతి ఆయోగ్ ప్రతినిధులు
- ఐదుగురు ఫార్మా పరిశ్రమల ప్రతినిధుల్నీ చేర్చిన సర్కారు
- ఇలాంటి వారు ఎలా విచారణ చేస్తారంటూ విమర్శలు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రమాదాలు పునరావృతమవుతాయంటూ ఆందోళన



గత నెల 21న విస్ఫోటం జరిగిన రోజున ఎసైన్షియా ఫార్మా కంపెనీ వద్ద కలకలం

సాక్షి, విశాఖపట్నం: పరిశ్రమలలో భద్రత ప్రశ్నార్థకమైంది.. రియాక్టర్లు అణుబాంబుల్లా పేలుతున్నాయి. పైప్‌లైన్లు యమపాశాల్లా మారుతున్నాయి. విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇల్లు చేరడం కష్టంగా మారింది. రసాయన పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు లేకపోవటం.. నైపుణ్యంగల కార్మికులను వినియోగించకపోవడం అధిక ప్రమాదాలకు కారణంగా చెప్పవచ్చు. అచ్యుతాపురం సెజ్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదం తర్వాత నిద్ర మేల్కొన్నట్లు నటించిన ప్రభుత్వం.. తూతూ మంత్రంగా హైలెవల్ కమిటీని విచారణకు వేసి మొద్దు నిద్రలోకి జారుకుంది. కనీసం ఫార్మాకు సంబంధించిన నిపుణులు లేని ఈ కమిటీ ఎందుకంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా ఏ పరిశ్రమల్లో అయితే ప్రమాదాలు జరుగుతున్నాయో ఆ కంపెనీ ప్రతినిధులనే కమిటీలో భాగస్వాములను చేయడంతో చంద్రబాబు దగా బయటపడింది.

ఆగస్ట్ 21న అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంలో 17 మంది మృత్యుఒడికి చేరుకోగా.. 40 మంది క్షతగాత్రులయ్యారు. తక్షణ విచారణకు ఏడు ప్రభుత్వ విభాగాల అధికారులతో ప్రమాదానికి కారణాలను అన్వేషించింది. ఇకపై ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు సంభవించకుండా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు నిపుణులతో కూడిన హైలెవల్ కమిటీని ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన నెల రోజుల తర్వాత కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

12 మందితో హైలెవెల్ కమిటీ ఏర్పాటు

భవిష్యత్తులో ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరగకుండా ఏఏ చర్యలు తీసుకోవాలి..? ప్రస్తుతం ఉన్న కంపెనీలు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా.? కెమికల్ రియాక్షన్లు జరగకుండా ఉండేందుకు ఏఏ చర్యలు తీసుకుంటున్నారు.? సిబ్బంది, కార్మికుల్లో నైపుణ్యం ఏమేరకు ఉంది.? నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలు నడుస్తున్నాయా లేదా.? మొదలైన అంశాలపై విచారణ చేపట్టడంతో పాటు పారిశ్రామిక భద్రతా అంశాలు పెంచేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశాలపై రికమండేషన్లు ఇవ్వాలని కమిటీకి దిశానిర్దేశం చేశారు. మొత్తం 12 మంది సభ్యులతో పాటు ఇండస్ట్రీ మెంబర్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్ పేరుతో మరో 8 మందిని కూడా చేర్చారు.

సేఫ్టీ ప్రొటోకాల్స్‌పై అనుభవం ఉన్న వారేరీ?

ఫార్మా ప్రమాదాలపై ప్రభుత్వం నియమించిన హైలెవల్ కమిటీని చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. ఐఐటీ, నీతి ఆయోగ్ ప్రతినిధులున్నారు కానీ.. వారెవ్వరికీ సేఫ్టీ ప్రొటోకాల్స్‌పై అనుభవం లేదు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే.. ఏ పరిశ్రమల్లో ప్రమాదాలు నిరంతరం జరుగుతున్నాయో, ఆ పరిశ్రమల ప్రతినిధులను మెంబర్లుగా చేర్చడం. అలాంటివారు మెంబర్లుగా ఉన్న కమిటీ ఇచ్చిన సలహాల మీద ప్రజలకు గానీ, ప్రభుత్వానికి గానీ నమ్మకం ఎలా కలుగుతుందో అర్థం కావడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లనే తరచూ సంభవిస్తున్నాయి. ప్రభుత్వం హైలెవెల్ కమిటీ పేరుతో విడుదల చేసిన జీవో నం.51ని తక్షణమే సవరణ చేసి పరిశ్రమల ప్రతినిధులకు బదులుగా నిపుణులను నియమించాలి. ఈ విషయంపై సీఎం చంద్రబాబుకు కూడా లేఖ రాశా.

– ఈఏఎస్ శర్మ, విశ్రాంత ఐఏఎస్ అధికారి

నిపుణులెక్కడ చంద్రబాబూ?

ప్రమాదం జరిగినప్పుడు కంటితుడుపు చర్యగా ఈ హైలెవల్ కమిటీని సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసినట్లు స్పష్టమవుతోంది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వసుధా మిశ్రా చైర్‌పర్సన్‌గా ఏర్పాటు చేసిన కమిటీలో పర్యావరణం, అటవీశాఖ స్పెషల్ సీఎస్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు పరిశ్రమల శాఖ, వీసెజ్, ఫైర్, పరిశ్రమలు, ఏపీఐఐసీ తదితర విభాగాలకు చెందిన ఉన్నతాధికారులను సభ్యులుగా నియమించారు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ని కన్వీనర్‌గా నియమించారు. అయితే ఫార్మాకు సంబంధించిన అంశాలు, కెమికల్ రియాక్షన్‌కు సంబంధించిన వివరాలపై క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఏ ఒక్క నిపుణుడూ లేకపోవడం గమనార్హం. ఒక ప్రిన్సిపల్ సైంటిస్ట్‌ని గానీ, ఫార్మా ప్రొఫెసర్‌ను కానీ ఈ కమిటీలో నియమించలేదు. దీనివల్ల ఫార్మా సెజ్‌లలో ఉన్న రసాయనిక లోటుపాట్లపై ఎలా విచారణ చేపడతారన్నది ప్రశ్నార్థకంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. నిపుణులు లేకుండా కమిటీ ఎందుకు వేశారో అర్థం కావడం లేదంటున్నారు.

విచారణకు వారే అయితే ఎలా?

ఏర్పాటు చేసిన ఈ హైలెవల్ కమిటీలో మరో 8 మందిని పరిశ్రమల నిపుణులుగా నియమించారు. ప్రమాదాలకు కారణమని చెబుతున్న పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధులనే ఇందులో చేర్చడం విడ్డూరంగా ఉంది. తమ ఫ్యాక్టరీల్లో ఉన్న లోటుపాట్లనను విచారణ కమిటీ సభ్యులుగా ఉన్న ప్రతినిధులు ఎలా బహిర్గతం చేస్తారన్నది ప్రశ్నార్థకమే. ఇండస్ట్రీ మెంబర్లు, నిపుణులుగా శ్రీ సిటీ ప్రతినిధి, పరవాడ ఫార్మా సిటీ, బల్క్ డ్రగ్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ (బీడీఎంఏ), అచ్యుతాపురం సెజ్, ఐఐటీ చెన్నై, ఐఐటీ తిరుపతికి చెందిన ఇండస్ట్రీ సేఫ్టీ ఎక్స్‌పర్ట్, నీతి ఆయోగ్ నిపుణుడు.. ఇలాంటి వారిని నియమించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం తూతూ మంత్రంగా విచారణ జరిపించేందుకే తప్ప.. క్షేత్ర స్థాయిలో ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి ప్రమాదకర పరిశ్రమలపై చర్యలు తీసుకోవడం, భద్రతా ప్రమాణాలను పెంచాలన్న ఆలోచనలు ప్రభుత్వానికి లేనట్లు ఈ విచారణ కమిటీని చూస్తే స్పష్టమవుతోందంటూ ఆరోపిస్తున్నారు.

నవయుగ వైతాళికుడికి నవ్య నివాళి



ఎస్.రాయవరంలో గురజాడ విగ్రహం వద్ద విద్యార్థుల మానవహారం

- ఘనంగా గురజాడ జయంతి వేడుకలు
- ఎస్.రాయవరంలో కోలాహలం

ఎస్.రాయవరం: దేశమును ప్రేమించుమన్నా.. అని దేశభక్తిని ఉద్బోధించాడు. కన్యాశుల్కం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ రచనల ద్వారా మహిళలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపాడు.. తన రచనా పటిమతో సాహితీరంగంలో తనదైన ముద్ర వేసి మహాకవిగా, నవయుగ వైతాళికుడిగా వెలుగొందాడు. అడుగుజాడ గురజాడది.. అంటూ తర్వాత తరాల రచయితలు కీర్తించేలా మార్గదర్శకుడయ్యాడు.. ఆ మహనీయుడి జయంతిని ఆయన జన్మస్థలమైన ఎస్.రాయవరంలో శనివారం పండగలా నిర్వహించారు. నేటి తరానికి గురజాడ వెంకట అప్పారావు గొప్పదనం తెలిసేలా విద్యార్థులతో అనేక కార్యక్రమాలు రూపొందించి శుక్ర, శనివారాల్లో ప్రదర్శించారు. గురజాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. బజారు వీధిలో ఉన్న గురజాడ కాంస్య విగ్రహం వద్ద శనివారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురజాడ రచనలపై ప్రసంగించారు. 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అనే పద్య గేయాన్ని విద్యార్థులు ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో యలమంచిలి కళాకారులతో ఏర్పాటు చేసిన నృత్యాలు అలరించాయి. మహిళలు కోలాటం ప్రదర్శించారు. మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కంబాల జోగులు గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాకవి గురజాడ ప్రపంచ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు పొందారని, తన రచనలతో భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, గురజాడ ఫౌండేషన్ అధ్యక్షుడు కర్రి వెంకటేశ్వరరావు, కార్యదర్శి కందుల వెంకటేశ్వరరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, వెంకటాపురం సర్పంచ్ కొప్పిశెట్టి సత్యం పాల్గొన్నారు.



చిన్నారుల నాట్య ప్రదర్శన



మహిళల కోలాటం

కలెక్టరేట్‌లో నివాళి



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: సమాజ సంస్కరణకు గురజాడ అప్పారావు ఎన్నో విలువైన రచనలు చేశారని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గురజాడ జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురజాడ రచనలు సమాజంపై ప్రభావం చూపాయన్నారు. డీఆర్వో బి.దయానిధి, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, డీఎల్‌డీవో మంజులవాణి, డీపీవో శిరీష, డీపీఈఆర్వో నాగలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

నేడు సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల కౌన్సెలింగ్

- 64 మందిలో 48 మంది బదిలీలకు అవకాశం
- సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్ల బదిలీలు నేటితో పూర్తి
- మంచి స్థానాల కోసం భారీ పైరవీలు

విశాఖ సిటీ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు ఈ నెల 22వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర (ఉమ్మడి విశాఖ, ఉమ్మడి విజయనగరం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాల పరిధి) జోన్‌లో మొత్తం 64 సబ్ రిజిస్ట్రార్లు ఉండగా.. తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా ఇందులో 48 మంది సబ్ రిజిస్ట్రార్లు బదిలీ కానున్నారు. మార్చి నెలలో పదవీ విరమణ చేయనున్న సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల జాబితా నుంచి మినహాయించారు. ఇందులో ఆనందపురం, పాలకొండ సబ్ రిజిస్ట్రార్ వచ్చే ఏడాది మార్చిలోగా పదవీ విరమణ చేయనుండటంతో ఈ స్థానాలను మినహాయించారు. మధురవాడ, భీమిలి, సూపర్ బజార్ ఆర్వో, ద్వారకానగర్, అనకాపల్లి, విజయనగరం, విజయనగరం వెస్ట్, శ్రీకాకుళం టౌన్‌తో పాటు కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చేందుకు పలువురు సబ్‌రిజిస్ట్రార్లు పైర వీలు చేసుకుంటున్నారు. అంతా కౌన్సెలింగ్ ద్వారానే జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నా.. అధికార పార్టీ నేతల ద్వారా పైరవీలతో పాటు భారీ ఎత్తు న ముడుపులు సమర్పించుకునే వారికి మంచి పోస్టింగులు దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ కౌన్సెలింగ్ టీమ్‌కు డీఐజీ బాలకృష్ణ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్లతోపాటు సీనియర్ అసిస్టెంట్స్, ఆఫీస్ సబార్డినేట్స్ బదిలీలను ఆదివారం పూర్తి చేయనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

ఏయూను సందర్శించిన మైటీ కార్యదర్శి



మైటీ కార్యదర్శి కృష్ణన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(మైటీ) కార్యదర్శి ఎస్.కృష్ణన్ శనివారం ఆంధ్రా యూనివర్సిటీని సందర్శించారు. ముందుగా ఏయూలో ఏర్పాటు చేసిన నాస్‌కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఏయూ అధికారులతో భేటీ అయ్యారు. శతాబ్దికి చేరవవుతున్న యూనివర్సిటీ విశిష్టతను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు వివరించారు.

తల్లీకూతుళ్లకు అరుదైన అవకాశం



పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన రోలుగుంట ఇంగ్లిష్ ఉపాధ్యాయిని నాగజ్యోతి, ఆమె కుమార్తె సాహితి

- అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన నాగజ్యోతి, కుమార్తె సాహితి
- ఇద్దరికీ ఒకేసారి అవకాశం రావడంపై హర్షాతిరేకాలు

రోలుగుంట : ఇష్టపడిన రంగంలో కూతుళ్లను ప్రోత్సహిస్తూ వారికి గెలుపు బాటలు వేసే తల్లుల గురించి విన్నాం... తమ విజయంతో కూతుళ్ల జీవితాల్లో స్ఫూర్తిని నింపిన అమ్మలను గురించి చదివాం... అయితే ఒకే రంగంలో ఇద్దరూ అరుదైన విజయాలు సాధిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఈ తల్లీకూతుళ్లు. వారే ఇంగ్లిష్ ఉపాధ్యాయిని పి.వి.ఎం.నాగజ్యోతి, ఆమె కుమార్తె సాహితి. రావికమతం మండలం కొత్తకోటకు చెందిన నాగజ్యోతి 27 ఏళ్లగా ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఇటీవల ఈమె రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఉత్తమ బోధనందిస్తూ ఎన్‌సీఈఆర్టీ నిర్వహించే వివిధ శిక్షణ కార్యక్రమాల్లో కూడా పాల్గొని మంచి నైపుణ్యం గడించారు. ఈమెకు బోధనతో పాటు క్రీడలపై కూడా మొదటి నుంచి ఎంతో ఆసక్తి. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు వెండి, బంగారు పతకాలు గెలుచుకున్నారు. తల్లికి తగిన కూతురుగా సాహితీ కూడా జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. అరుదుగా దక్కే అవకాశం వీరిద్దరికీ లభించింది. ఈ నెల 22 నుంచి 30 తేదీ వరకూ మలేషియా, సింగపూర్‌లలో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు వీరు ఎంపికయ్యారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాగజ్యోతి, స్విమ్మింగ్ పోటీలో సాహితీ పాల్గొనున్నారు. శనివారం బయలుదేరిన సందర్భంగా తల్లీకూతుళ్లు మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. తాము ఒకేసారి అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వీరి ఎంపికపై రోలుగుంట జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్‌రావు, సహచర ఉపాధ్యాయులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

76 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురు నిందితులకు రిమాండ్



ఆనందపురం కూడలి వద్ద ఆటోలో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

కె.కోటపాడు: ఆటోలో తరలిస్తున్న 76 కిలోల గంజాయిని ఎ.కోడూరు ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ పట్టుకున్నారు. మండలంలోని ఆనందపురం కూడలిలో శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు చేస్తుండగా, ఆటో వెనుక భాగంలో పార్సిల్స్ గుర్తించారు. దాన్ని తనిఖీ చేయగా రూ.3.80 లక్షల విలువ చేసే 76 కిలోల గంజాయి లభ్యమైంది. ఆటోలో గంజాయి తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు. వారిలో హుకుంపేటకు చెందిన కోడా నిలీజాన్, పాంగి శ్రీకాదాంబరి, జి.మాడుగులకు చెందిన డి.మరియ, ఎస్.కష్ణవేణి ఉన్నారు. గంజాయిని ఆనందపురం మీదుగా సబ్బవరం చేరవేసేందుకు వీరు ఆటోలో ప్రయాణిస్తూ పట్టుబడ్డారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శనివారం తెలిపారు.

పిడుగు పాటుకు పాడి గేదెలు మృతి



పాడి గేదె కళేబరం వద్ద దీనంగా రైతు

కశింకోట: మండలంలోని చింతలపాలెంలో శనివారం సాయంత్రం పిడుగు పాటుకు భార్యాభర్తలు అపస్మారక స్థితికి చేరగా, రెండు పాడి గేదెలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్షన్నర ఉంటుందని అంచనా. స్థానికుల కథనం మేరకు.. సాయంత్రం వర్షంతోపాటు పెద్ద శబ్దంతో పిడుగు పడింది. దాంతో పశువుల పాకల వద్ద పాడి గేదెలకు పరిచర్యలు చేయడానికి వచ్చిన పాడి రైతు బుదిరెడ్డి దుర్గినాయుడు, భార్య జయ అపస్మారక స్థితికి చేరుకున్నారు. వీరిని స్థానికులు అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పక్కనే పాకలలో పాడి రైతులు దుర్గినాయుడు, చిన్నఅబ్బాయిలకు చెందిన రెండు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. జీవనాధారమైన పాడి పశువులు పిడుగు పాటుకు మృతి చెందడంతో బాధితులు బోరున విలపించారు.

ఉద్యోగానికి ఎమ్మెల్యే హామీ.. ఎమ్మెల్సీ ఎసరు

మూడో రోజులుగా బాధిత మహిళ ధర్నా

భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆమెకు షిఫ్ట్ ఆపరేటర్ పోస్టు ఇచ్చి ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చి ఊరటపరిచారు. ఇప్పుడు అదే పోస్టుకు ఎమ్మెల్సీ ఎసరు పెట్టడంతో బాధిత మహిళ ఉసూరుమంటోంది. మూడు రోజులుగా ధర్నా చేస్తున్న ఆమెకు ఎమ్మెల్యే న్యాయం చేయకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చెయ్యపేట: రాజాం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట బాధిత మహిళ రొంగలి రామలక్ష్మి చేపట్టిన ధర్నా మూడో రోజు శనివారం కొనసాగింది. మండలంలోని ఆర్. భీమవరం గ్రామానికి చెందిన ఆమె భర్త నరసింగరావు రాజాం విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అతని కుటుంబానికే షిఫ్ట్ ఆపరేటర్ పోస్టు తిరిగి ఇస్తామని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు హామీ ఇవ్వగా, ఇప్పుడు అదే పోస్టును ఎమ్మెల్సీ చిరంజీవి స్వగ్రామం దొండపూడికి చెందిన వ్యక్తికి కట్టబెట్టారు. దీనిపై బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం నుంచి రాజాం సబ్ స్టేషన్ ఎదుట టెంట్ వేసుకుని న్యాయం కోసం ధర్నా చేస్తోంది. ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, అప్పుల భారంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తనకు షిఫ్ట్ ఆపరేటర్ పోస్టును తిరిగి ఇస్తామని ఆశ చూపించి ఇప్పుడు వేరే మండల వ్యక్తికి అప్పగించారని వాపోతోంది. ఇంతవరకూ బాధిత మహిళను ఎమ్మెల్యే పరామర్శించి న్యాయం చేయకపోవడంపై భీమవరం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమెకు మద్దతుగా గ్రామ నాయకులు మలిరెడ్డి బుజ్జి, కోట సత్యనారాయణ, కంచిపాటి శ్రీనివాసరావు, సూరిబాబు, పాపారావు, కవల సతీష్, సత్తిబాబు, శ్రీను తదితరులు ధర్నాకు దిగారు.



రాజాం వద్ద మూడో రోజు ధర్నాలో పాల్గొన్న బాధిత మహిళ రామలక్ష్మి

స్వచ్ఛతతో ఆరోగ్యం.. ఆనందం





స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో చెత్తా చెదారాలు తొలగిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక

తుమ్మపాల/అనకాపల్లి: జిల్లా అధికారులు శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యాలయ పరిసరాలు శుభ్రం చేశారు. పరిశుభ్రత ఆవశ్యకత అందరికీ తెలిసేలా చేశారు. కలెక్టరేట్ పరిసరాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్ స్వయంగా పాల్గొని చెత్తను తొలగించి పారతో శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు, గడ్డి, ప్లాస్టిక్ కవర్లు, గాజు పెంకులను ఏరి చెత్త తొట్టెలో వేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల మానసికంగా ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం అమలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెల ఒక రోజు కలెక్టరేట్‌లో పరిసరాలను శుభ్రం చేద్దామని అధికారులను సూచించారు. డీఆర్వో బి.దయానిధి, సీపీవో రామారావు, ఏవో శ్రీనివాసరావు, డీఎల్‌డీవో మంజులవాణి, డీపీవో శిరీష, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయ రహదారిపై ఉన్న పిచ్చిమొక్కలు, గడ్డి, ప్లాస్టిక్ కవర్లను సిబ్బందితో కలిసి ఎస్పీ ఎం.దీపిక తొలగించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి నెల నిర్వహిద్దామని కోరారు. అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏవో బి.శారద, సీఐలు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, వినోద్ బాబు, సతీష్, ఎస్‌ఐ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అధికార బలంతో అక్కృత్యాలు

- ఆస్తి కోసం అన్న కుటుంబాన్ని వేధిస్తున్న జనసేన నేత
- మీడియా సమావేశంలో ఆరోపించిన బాధితులు



విలేకరులతో మాట్లాడుతున్న దాడి సత్యవతి, కుమారుడు దాడి రాజేష్

అనకాపల్లి: రాజకీయ అండతో తన మరిది చేసిన అకృత్యాల వల్ల తన భర్త మంచానపడ్డారని, పెద్ద కుమారుడు మృతి చెందాడని, జనసేన నేతగా ఇప్పుడు తనను, తన చిన్న కుమారుడిని సైతం వేధిస్తున్నారని దాడి సత్యవతి ఆరోపించారు. శనివారం ఆమె అనకాపల్లి సీపీఎం కార్యాలయంలో చిన్న కుమారుడు దాడి రాజేష్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో సర్వే నెంబర్ 16/7(ఎ), 17/1, 17/2, 17/3 ల్లో తమకు భూములు ఉన్నాయని, మరిది దాడి సూరినాగేశ్వరరావు (సూరిబాబు) నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి సుమారు 75 సెంట్లు ఆక్రమించుకోవడమే కాకుండా.. తన కుమారుడు చావుకు కారణమయ్యారని ఆరోపించారు. స్థానిక పంచాయితీ సెక్రెటరీ, ఎమ్మార్వో, సబ్ రిజిస్ట్రార్ అండదండలతో అక్రమ డాక్యుమెంట్లు సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడ్డారని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, కుటుంబ పెద్దలతో అడిగించినా.. తమపై దాడి చేయడమే కాకుండా చంపేస్తామని బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

రోజురోజుకు పెరుగుతున్న ఆగడాలు

తన మరిది వేధింపులు ఈనాటివి కావని.. వడ్డాదిలో తన భర్త దాడి అచ్చిబాబు ఐస్ ఫ్యాక్టరీ నిర్మించి, మరిది సూరినాగేశ్వరరావుకు బాధ్యత అప్పగించారన్నారు. ఆయన చేసిన తప్పుల వల్ల నష్టపోవడమే కాక తన భర్త జైలు పాలయ్యారన్నారు. జైలు నుంచి తిరిగి వచ్చాక తమ భూముల్లో వ్యవసాయం చేసుకోవడానికి ప్రయత్నించగా మరిది సూరిబాబు, ఆయన భార్య తమపై దాడి చేశారని, కూతురి పెళ్లి చేయదలచి భూమి అమ్ముకుందామన్నా అడ్డుకున్నారని చెప్పారు. మనస్తాపంతో తన భర్త మంచాన పడ్డారని, పెద్ద కుమారుడు గ్రామ పెద్దల ముందు పంచాయతీ పెట్టగా దాడికి దిగి చంపేస్తా అని బెదిరించాడని వాపోయారు. మనస్తాపంతో తన పెద్ద కుమారుడు చనిపోయాడన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, దందా మరింత ఎక్కువైందని, జనసేన పార్టీలో ఉన్న తన మరిది తనను, తన చిన్న కుమారుడిని చంపేస్తానని బెదిరిస్తున్నట్లు దాడి సత్యవతి ఆరోపించారు.

మరిది దాడి సూరినాగేశ్వరావు తమ భూమిని ఆక్రమించడమే కాకుండా అతని భార్య పేరుమీద దొంగ డాక్యుమెంట్ సృష్టించి బ్యాంక్‌లో లోన్ తీసుకున్నారన్నారు. దీనిపై పోలీసులకు నాలుగు సార్లు స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. అయినా తమకు న్యాయం జరగలేదని వాపోయారు. ప్రస్తుతం ఆర్‌డీఓ కోర్టులో ఉన్నప్పటికీ ఆ భూమిని సూరినాగేశ్వరరావు ఆక్రమించుకోవడమే కాకుండా.. స్థానిక జనసేన, టీడీపీ నేతలు అండదండలతో తమపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. ఎమ్మార్వో, ఆర్డీఓ, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా తమకు న్యాయం జరగలేదన్నారు. జనసేన నేతగా చలామణి అవుతున్న సూరినాగేశ్వరరావు తన స్వార్థానికి అధికార బలాన్ని ఉపయోగించుకుంటున్నాడని, అధికారులు, పార్టీ పెద్దలు ఈ విషయాన్ని గమనించి, తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఇసుక ధర రెట్టింపుతో ఉపాధి దూరం

మధురవాడలో భవన నిర్మాణ కార్మికుల రాస్తారోకో



మధురవాడ మార్కెట్ వద్ద రాస్తారోకో చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మధురవాడ: ఇసుక అందుబాటులో లేకపోవడంతో పాటు రెట్టింపు ధరలకు అమ్మడం వలన నిర్మాణ రంగం మందగించిందని, భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్మిక సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం మధురవాడ మార్కెట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులు, బ్యానర్లతో రాస్తారోకో చేపట్టారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పి. రాజ్‌కుమార్, డి. అప్పలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తానని హామీ ఇచ్చి రెట్టింపు ధరలకు అమ్మకాలు జరుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. కార్మిక కుటుంబాలు ఉపాధి లేక అవస్థలు పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎం. అప్పన్న, ఏ.లక్ష్మణ, డి.రవి, కె. రమణ, టి.రామకృష్ణ, ఎస్.భాస్కరరావు, బి.రమణ, అనంతరావు, పాపారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 85ను తక్షణమే రద్దు చేయాలి

నల్లబ్యాడ్జీలు ధరించి పీహెచ్‌సీ వైద్యుల ధర్నా



ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులను చిన్న చూపు చూస్తూ జీవో 85 విడుదల చేసిందని, దీన్ని తక్షణమే రద్దు చేయాలని ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.తిరుపతిరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి గేటు వద్ద పీహెచ్‌సీ వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించిన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 85 వల్ల గ్రామీణ వైద్యులకు ఉద్యోగంలో సర్వీసు కోటా 30 శాతం నుంచి 15 శాతానికి కుదించారన్నారు. 6, 12, 18 ఏళ్ల సర్వీసు కలిగిన వైద్యులకు ప్రమోషన్లు, గ్రేడ్ ఇంక్రిమెంట్లు లేవని, 20 సంవత్సరాలపాటు ఒకే పోస్టులో విధులు నిర్వహిస్తున్నారని వాపోయారు. గిరిజన ప్రాంతాల్లో వైద్యులను ఏబీవీపీలో పనిచేసే విధంగా గుర్తించి 50 శాతం జీతం అలవెన్స్ ఇవ్వాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే సమయంలో మహిళా వైద్యులకు సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అసోసియేషన్ అధ్యక్షురాలు ఎస్తేర్ రాణి, వైద్యులు వాణిజగదీశ్వరి, యశోద, మనీషా, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

జంపపాలెం జెడ్పీ హైస్కూల్ తనిఖీ చేసిన డీఈవో

యలమంచిలి రూరల్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటలక్ష్మమ్మ సూచించారు. మండలంలోని జంపపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వివిధ రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులంతా శతశాతం ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదునివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, ఉపాధ్యాయుల టీచింగ్ నోట్సు తనిఖీ చేశారు. అంతకుముందు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయుడు ఏవీహెచ్ శాస్త్రి, వై వెంకటేశ్వర్రావు ఉన్నారు.



మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

వచ్చే నెలాఖరులో రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ ప్రారంభం

ఉక్కునగరం : అక్టోబర్ నెలాఖరులో రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ ప్రారంభం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ అరుణ్ కాంతి బాగ్చీ తెలిపారు. శనివారం అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో సీఎండీ ఈ మేరకు తెలిపినట్టు కార్మిక నాయకులు పేర్కొన్నారు. ఈనెలాఖరులో ఒక ఫర్నేస్‌లో 7 వేల టన్నులు ఉత్పత్తికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈనెల 18న కేంద్రం నుంచి రూ.500 కోట్లు వచ్చిందని అందులో జీఎస్టీ చెల్లించడంతో పాటు ముడి సరుకుల కోసం వినియోగించినట్టు పేర్కొన్నారు. రెండు ఫర్నేస్‌లలో అధిక ఉత్పత్తి చేయడానికి చర్యలు తీసుకుటామన్నారు. కేంద్రం నుంచి మరింత సాయం అందే అవకాశాలు ఉన్నాయని.. గత 10 రోజులుగా న్యూఢిల్లీ కేంద్రంగా జరిగిన సమాచారాన్ని కార్మిక నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు వీఆర్ఎస్, డిప్యుటేషన్‌లను వ్యతిరేకించారు. జీతాలు, పీఎఫ్, ఎస్‌బీఎఫ్, థ్రిఫ్ట్ సొసైటీల చెల్లింపులపై సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉక్కు యాజమాన్యం ప్రతినిధులతో పాటు నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎ.స్.ఎన్. రావు, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, రామ్మోహన్‌కుమార్, వి.శ్రీనివాస్, రామ్‌కుమార్, బి.డేవిడ్, కె.శ్రీనివాసనాయుడు, సురేష్‌బాబు, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

సదరం క్యాంప్‌లో 34 మంది అర్హుల గుర్తింపు

అనకాపల్లి: ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందించేందుకు 34 మందిని అర్హులుగా గుర్తించామని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో శనివారం నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహించామన్నారు. ఈ నెల 23న రావికమతం, రోలుగుంట మండలాలకు చెందిన దివ్యాంగుల కోసం క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల మంజూరు

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

గొలుగొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు ఎన్నో చేపట్టామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆయన గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని తెలిపారు. గ్రామాల్లో మంచి పాలన కోసం పంచాయతీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. ఆర్డీవో జయరాం తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై హత్యాయత్నం

ఎంవీపీకాలనీ: సీతంపేటకు చెందిన వివాహితపై ఆర్.శ్రీనివాసరావు అనే వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేటకు చెందిన వివాహిత హెచ్‌బీ కాలనీలో వస్త్ర దుకాణం నిర్వహిస్తోంది. తనతో మాట్లాడాలని బాధిత మహిళను కొంత కాలంగా శ్రీనివాసరావు ఒత్తిడి తెస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆమె వస్త్ర దుకాణం మూసి ఇంటికి వెళుతుండగా వెంటపడ్డాడు. హెచ్‌బీ కాలనీ దరి స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ వద్ద ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. చాకుతో వెనుక నుంచి పొడవడంతో కేకలు వేసుకుంటూ బాధిత మహిళ పరుగులు తీయడంతో శ్రీనివాసరావు పరారయ్యాడు. వెంటనే స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం వెంకోజీపాలెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని శ్రీనివాసరావుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేశారు.

క్లుప్తంగా

ప్రతి వ్యక్తి రక్తపరీక్షలు చేసుకోవాలి

- రెడ్ క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా వయస్సు బట్టి ప్రతీ వ్యక్తి ఏడాదికి రెండు సార్లు రక్తపరీక్షలు చేసుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.రామ్మూర్తి తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పూల్‌బాగ్ రోడ్డులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో 150 మంది విద్యార్థులకు ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన విద్యార్థులు ఏడాదికి రెండు సార్లు రక్త దానం చేయడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వాతావరణ మార్పులు కారణంగా వ్యాధులు బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, రహదారులపై ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవడం వల్ల ఈ పరిస్థితి రావచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ హిమజా కిరణ్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఉత్సవానికి ఏర్పాట్లు

కశింకోట: దుర్గమాంబ ఉత్సవం పురస్కరించుకుని విద్యుత్ దీపాలంకరణ శనివారం చేపట్టారు. కశింకోటలో అమ్మవారి ఉత్సవం ఈ నెల 26న జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయం నుంచి స్థానిక సంతబయల వద్ద అమ్మవారి ముఖద్వారం వరకు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్మశానవాటికలో పరిశుభ్రత పనులు



జేసీబీతో తుప్పలు తొలగించి శుభ్రత పనులు

కశింకోట: చింతలపాలెంలో శ్మశానవాటికలో పరిశుభ్రత పనులు చేపట్టారు. పంచాయతీ నిధులతో శనివారం జేసీబీతో తుప్పలను తొలగించారు. ఉప సర్పంచ్ బల్ల అప్పలకొండ, మాజీ సర్పంచ్ కర్రి దుర్గినాయుడు, టీడీపీ నాయకులు జెర్రిపోతుల నూకినాయుడు, కాపిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం

పరవాడ: దేశపాత్రునిపాలెంలో తాగునీటి సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని 79 వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. వార్డులో ఏర్పాటు చేసిన చేతి పంపును శనివారం ఆయన ప్రారంభించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 258 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,160	4,800
రెండో రకం	3,400	4,200
మూడోరకం	3,150	3,320

అనకాపల్లి సినిమాలు

గొర్రె పురాణం	:రాజా
ఏఆర్ఎం 3డీ	:సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్లిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
చిక్లెట్స్	:వెంకటేశ్వర
మన్యం ధీరుడు సీతారామరాజు	:శ్రీసత్య
హైడ్ ఎన్ సీక్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 361 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 325 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

తిరుమల మహా ప్రసాదంపైనా రాజకీయమా?

- ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి ఇది తగునా
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు దంతులూరి దిలీప్ కుమార్, జాజుల రమేష్



దిలీప్‌కుమార్



జాజుల రమేష్

అనకాపల్లి: తిరుమల తిరుపతి దేవస్థానంలో దేవుని ప్రసాదంపైనా రాజకీయం చేయడం చంద్రబాబుకే చెల్లిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరు దిలీప్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి పాలన వంద రోజులు పూర్తయ్యే వరకు ఈ విషయాన్ని ఎందుకు బయట పెట్టలేదని, ఇప్పుడు మాత్రమే ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు ఆరోపణ చేయడం అనేది ఇప్పుడే చూస్తున్నామని, అది నిజమని తేలితే ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని నిలదీశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా తిరుమల ప్రసాదాన్ని రాజకీయంగా వాడుకోవడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. హిందువుల మనోభావాలను, వేంకటేశ్వర స్వామి ప్రసాదం, టీటీడీ విశిష్టతను కాపాడాల్సిన చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తూ రాష్ట్రానికి తలవంపులు తెస్తున్నారన్నారు. వాస్తవానికి తిరుపతి లడ్డూలో నాణ్యత లోపించినా, కొవ్వు కలిపినా ఆ విషయం తొలుత తెలియజేయాల్సింది దేవస్థానం ఈవో అని, టీడీపీ కార్యాలయం నుంచి ఎందుకు ప్రకటన విడుదల చేశారో ప్రజలు గ్రహిస్తున్నారని తెలిపారు.

కూటమి పాలనపై చర్చను పక్కదారి పట్టించాలనే ఉద్దేశంతోనే తప్పుడు ప్రచారాన్ని తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి, ప్రధానమంత్రికి ఈ విషయంపై లేఖ రాస్తానని న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారన్నారు. ఎన్డీఏ మాత్రం ఆ దిశగా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీపై తప్పుడు ప్రచారం చేసి పబ్బం గడుపుకోవాలని చంద్రబాబు చూస్తున్నారని, వేంకటేశ్వర స్వామి దగ్గర తప్పు చేసిన వ్యక్తులకు గతంలో శిక్ష పడిందని పేర్కొన్నారు.

ప్రజాగ్రహాన్ని తప్పించుకోవడానికి దుష్ప్రచారం

వంద రోజుల ప్రజాగ్రహాన్ని తప్పించుకోవడానికి సీఎం చంద్రబాబు రాజకీయం కోసం కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామి లడ్డూపై బురద జల్లడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జంతువుల నూనె స్వామి ప్రసాదంలో వాడుతున్నారనే ఆరోపణలు చేసిన ఆయనకి కలియుగ దేవుడు త్వరలో తప్పకుండా శిక్ష విధిస్తాడని జోష్యం చెప్పారు. అలిపిరి ఘటనలో ప్రాణాపాయం నుంచి వేంకటేశ్వరస్వామి రక్షించిన రోజులు మర్చిపోయినట్లుగా ఉందన్నారు. ప్రభుత్వాలు మారుతుంటాయి, స్వామి వారికి ఆగమన శాస్త్రోక్తంగా సేవకులు, వ్యక్తులు మారన్నారు. జంతువుల నూనె ప్రసాదం తయారీకి వస్తే అక్కడున్న అర్చకులు, సేవకులు ఊరుకుంటారా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక ఈ విధంగా రాష్ట్ర ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నట్లు విమర్శించారు.

జీతాలు పెంచాలని కాంట్రాక్టు కార్మికుల ధర్నా



ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

అనకాపల్లి: సుప్రీం కోర్టు ఆదేశాలు మేరకు సమాన పనికి సమాన వేతం ఇవ్వాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, సూపర్‌వైజర్లు శనివారం ఇక్కడ ఆస్పత్రి ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అమలు చేయకపోవడంతో ఈ నెల 30వ తేదీ నుంచి సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. 21 రోజులుగా కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వివిధ రూపాల్లో నిరసనలు, ధర్నాలు చేస్తున్నప్పటికీ ఆస్పత్రి యాజమాన్యానికి చీమకుట్టినట్లుగా లేదన్నారు. ఒప్పంద కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్‌లో కలపాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉచిత మెడికల్ సౌకర్యం, ఏడాదికి రెండు జతల యూనిఫాం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు ఎస్.సంతోష్, నూకరాజు, వెంకటలక్ష్మి, అడ్డా ప్రసాద్, సుదీర్, సూరిబాబు, లోవరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో అన్న సమారాధన



స్వామివారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కిషోర్

కశింకోట: వినాయక ఉత్సవాల్లో భాగంగా కొత్తపల్లిలో శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, యువ నాయకుడు మలసాల కుమార్‌రాజా దర్శించుకుని వినాయక విగ్రహానికి సంప్రదాయంగా పూజలు చేశారు. అన్న సమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవాలు



కోమటవీధిలో వినాయకుడి ఊరేగింపు



ఎస్సీ కాలనీలో..



ఎస్సీ కాలనీలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కశింకోట: వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక గోవిందరావు కాలనీ, ఎస్సీ కాలనీ, కోమటవీధిల్లో వినాయక విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం శారదానదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. పెద బజారులో వినాయక మండపం వద్ద అన్న సమారాధన జరిగింది.

నేడు అన్నసమారాధన

కశింకోట వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నెలకొల్పిన వినాయక నిమజ్జనోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం ఊరేగింపు నిర్వహించి శారదానదిలో నిమజ్జనం చేస్తామన్నారు.

విద్యార్థులకు బృందగాన పోటీలు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ప్రతినిధులు

అనకాపల్లి: స్థానిక జీవీఎంసీ వేల్పులవీధి హైస్కూల్ ఆవరణలో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ బృందగాన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్ ప్రతినిధి ఆళ్ల ఓం రామ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రాంతీయ, ఇతర భాషలు, ఫోక్ వంటి వాటిపై పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రుధిరారాణి, పరిషత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వజ్ర కవచాలంకృతుడిగా ధ్యాన వేంకటేశ్వరస్వామి



ధ్యాన వేంకటేశ్వస్వామి అలంకరణ

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు వజ్ర కవచాలంకృతుడిగా దర్శనమిచ్చారు. శనివారం పూలు, తులసీమాలలతో అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గురజాడ రచనలకు విశేష ప్రజాదరణ



జూనియర్ కళాశాలలో గురజాడ అప్పారావుకు నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

పరవాడ: స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం మహాకవి గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా సంఘ అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవని కొనియాడారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో ఒకరన్నారు. గురజాడ కన్యాశుల్కం నాటకానికి విశేష ప్రజాదరణ లభించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయలక్ష్మి, శ్యామల, విజయశ్రీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి జీవీఎంసీ 98వ వార్డు పరిధి అడవివరంలోని సాయినగర్‌కి చెందిన రెడ్డి రంగారావు, నాగలక్ష్మి ప్రసన్న దంపతులు లక్ష 116 రూపాయల విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్‌వో కార్యాలయంలో శనివారం అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ఏఈవో పిల్లా శ్రీనివాసరావు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి వేద ఆశీర్వచనం, ప్రసాదం అందజేశారు. పీఆర్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు, ఉద్యోగి సూర్యనారాయణ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



గరుడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకట రమణ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. వీరంతా ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో వారి పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో సుజాత, ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

అప్పన్నకు విశేషంగా గురుడసేవ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఉదయం గరుడసేవ విశేషంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై వేంజేపచేసి అష్టోత్తర శతనామావళి పూజ చేసి హారతులు అందజేశారు. అనంతరం పూజలో పాల్గొన్న భక్తులు గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేశారు. వారికి స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

9 మద్యం క్వాటర్ బాటిళ్ల స్వాధీనం

అనకాపల్లి: కుంచంగి గ్రామంలో ఎస్.దేవుడమ్మ పాన్‌షాప్‌లో తొమ్మిది మద్యం క్వాటర్ బాటిళ్లతో పట్టుబడినట్టు రూరల్ ఏఎస్ఐ సత్యనారాయణ శనివారం చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ రంగారావు

పరవాడ : మండల పరిధి గొర్లివానిపాలెంలోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. కింకో షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన ఆర్.హర్షిత కరాటే, కుమిటీలో స్వర్ణ పతకాలు కైవశం చేసుకుంది. కె.మాన్సస్ కరాటేలో స్వర్ణం, కుమిటీలో కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. ఎ.చరణ్ కరాటేలో స్వర్ణ పతకం, ఎ.వనీస్ కరాటేలో స్వర్ణ పతకం, కుమిటీలో కాంస్య పతకాలను సాధించారు. విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, వారిని తీర్చిదిద్దిన కోచ్‌లు ఎ.వి.రామారావు, లోహిత్‌ను పాఠశాల డైరెక్టర్ ఎస్.రంగారావు శనివారం అభినందించారు.

క్షణికావేశంలో జైలు పాలు

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ధర్మారావు



రికార్డులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి ధర్మారావు

అనకాపల్లి: క్షణికావేశంలో చేసిన నేరాలతో కొంత మంది వ్యక్తులు జైలు పాలవుతున్నారని అనకాపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ధర్మారావు తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక సబ్ జైల్ ఆవరణలో వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో ఆయన మాట్లాడారు. ఏయే నేరాల్లో శిక్ష అనుభవిస్తున్న వారి వివరాలను తెలుసుకుని, ఖైదీల భవిష్యత్తుకు సంబంధించిన పలు సూచనలు ఇచ్చారు. జైల్ పరిసరాల్లో అపరిశుభ్రత లేకుండా త్వరగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆహార మెనూ వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో న్యాయ సహాయకుడు సాయిరాం, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ, జైల్ సూపరింటెండెంట్ గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలు వాయిదా

కశింకోట: మండల స్థాయి స్కూలు గేమ్స్‌లో భాగంగా మూడో రోజు శనివారం జరగాల్సిన అథ్లెటిక్స్ పోటీలు అనివార్య కారణాల వల్ల ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసినట్లు స్థానిక బాలికల హైస్కూలు పీడీ పెంటకోట కమల తెలిపారు. ఇప్పటికే బాలబాలికలకు వేర్వేరుగా రెండు రోజుల పాటు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, షటిల్, యోగా, చదరంగం ఆటలను నిర్వహించి విజేత జట్లను ఎంపిక చేశామన్నారు. బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించాల్సి ఉందన్నారు. వీరికి వంద, 200, 400, 800, 1500, 3 వేల మీటర్ల విభాగాల్లో రన్నింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. షాట్‌పుట్, త్రో బాల్, జావెలిన్ త్రో, హై జంప్, లాంగ్ జంప్ తదితర పోటీలు జరుపుతామన్నారు. రన్నింగ్‌కు విశాలమైన స్కూలు మైదానం ఎంపిక చేస్తున్నామని, మిగిలిన పోటీలను తమ పాఠశాలలో నిర్వహించనున్నామన్నారు. ఇప్పటి వరకు జట్ల వారీగా ఆటల పోటలు జరపగా, వ్యక్తిగతంగా అథ్లెటిక్స్ నిర్వహిస్తామన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపుతామన్నారు.

95 శాతం వరినాట్లు పూర్తి



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: జిల్లాలో ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలతో వరినాట్లపై రైతులు దృష్టి సారించారని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. శనివారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో టీ అండ్ వీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ నెలలో నేటి వరకూ 30 శాతం అధిక వర్షం కురిసిందన్నారు. 95 శాతం వరినాట్లు వేశారన్నారు. ఇంతవరకూ వరిసాగు ఆశాజనకంగా ఉందన్నారు. జిల్లాలో వ్యవసాయశాఖ అధికారి ప్రతినిధి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు 24 మండలాలకు 20 మండలంలో అధిక వర్షం నమోదైనట్లు చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నేటి వరకు వరి, చెరకు వంటి పంటలలో చీడ పీడలు గమనించలేదని, ఇప్పుడు వాతావరణ పరిస్థితులలో వరి పంటలో రాబోయే రోజులలో ఆకుముడత, కాండం తొలుచు పురుగు ఆశించవచ్చునని తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా వీటిని నివారించవచ్చని చెప్పారు. శాస్త్రవేత్తలు పి.వి.కె.జగన్నాథరావు, రమణమూర్తి, బి. భవాని, సిహెచ్ఎస్. రామలక్ష్మి, డి. ఉమామహేశ్వర రావు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి



మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి: మతతత్వ, కార్పొరేట్ శక్తుల కలయికపై శక్తివంచన లేకుండా పోరాటం చేసిన యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి సీపీఎంకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. శనివారం స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయం మేడపై కొణతాల సుబ్రహ్మణ్యం హాలులో సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి వారి జీవన ప్రమాణాలు పెంచాలని కోరుకుంటూ పార్లమెంటులో అనేక రకాల పోరాటాలు చేశారన్నారు. 2004 నుంచి 2008 వరకు ప్రభుత్వ రంగం సంస్థల అభివృద్ధికి చేసిన కృషి వెల కట్టలేనిదన్నారు. చివరి వరకు ఎర్రజెండా కప్పుకొని ఆయన నమ్మిన ఆశయాలకు అనుగుణంగా పనిచేసిన వ్యక్తి అని కొనియాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ, సీపీఎం జిల్లా నాయకులు ఎస్.ఎ స్.ఎస్.నారాయణ, గంటా శ్రీరామ్, పెంటకోట శ్రీనువాసరావు, కె.తేరయ్యబాబు, ఆర్. రమేష్, రమణాజీ, వి.వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



స్టేషన్ ఆవరణ శుభ్రపరుస్తున్న పోలీసులు



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విద్యార్థులు

తుమ్మపాల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం రేబాకలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంతో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో మొక్కలు నాటాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గిరీష్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌తోపాటు ఆవరణను శుభ్రపరిచారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలంతా శాంతిగా ఉండాలి



బెలూన్లు ఎగురవేస్తున్న చిన్నారులు

అనకాపల్లి: స్థానిక ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ ప్లేస్కూల్ ఆవరణలో శనివారం అంతర్జాతీయ శాంతి దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో విభిన్న సంస్కృతీ సంప్రదాయాలు, భాషలు, జాతి, మతాలు, వర్గాలు ఇతరత్రా వాటితో కూడియున్న ప్రజలంతా శాంతిగా ఉండాలని కోరారు. యుద్ధాలు, విభేదాలను వీడి అహింస, శాంతి మార్గాన్ని అవలంబిస్తూ, మనిషిలాగా జీవించాలని, దానికి ధ్యానం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అనంతరం చిన్నారులు శాంతికి సూచికగా గాలిలోనికి తెలుగు వర్ణ బెలూన్లను ఎగరవేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విశ్రాంత ఏఈ మల్ల చిన్నారావు పాల్గొన్నారు.